వరద నష్టం అంచనాలు తక్షణమే వేయండి

పాలేరు, హట్యాతండాల్లో మంత్రి పొంగులేటి

బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, సెప్టెంబర్ 5: వరద వల్ల జరిగిన నష్టాన్ని తక్షణమే పూర్తి స్థాయి అంచాలు వేయాలని, రహదారులు, బురదనీరు, రోడ్డు కనెక్టివిటీ, విద్యుత్, తాగునీరు, పంట నష్టం విషయంలో అధికారులు పూర్తి స్థాయిలో బాధ్యత తీసుకుని, పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని రాష్ట్ర రెవెన్యూ,గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని పాలేరు వద్ద మినీహైడెల్ ప్రాజెక్టు పక్కన పడిన గండిని, సాగర్ ప్రధాన కాలువపై పడిన గండిని, హట్యాతండాలో పొలాల్లో వేసిన ఇసుక మేట ప్రాంతాలను పరిశీలించారు. కూసుమంచి, నేలకొంపడపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెంలో జరుగుతున్న ప్రతీ పనిలో సంబంధిత అధికారులు రాత్రి సమయాల్లో కూడా పనులు చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. అంచనాలు వేసిన వ్యవసాయ శాఖ వివరాలను ఏడీ సరిత, ఏవో వాణిని అడిగి తెలుసుకున్నారు.

పునరావాస కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు రావద్దు

పలు కేంద్రాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్ శ్రీజ

ఖమ్మం రూరల్: అధికారులు,సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

కూసుమంచి, సెప్టెంబర్ 5: వరద ముంపు ప్రజల కోసం ఏర్పాటు చేసిన పునవాస కేంద్రాల్లో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది రాకుండా వారికి భోజనం, రాత్రి బస, మెడికల్ కిట్‌లు, మంచి నీరు, వాటితో పాటు అన్నీ వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పీ శ్రీజ అన్నారు. మండలంలోని పాలేరు, కూసుమంచి పునరావాస కేంద్రాలను ఆమె గురువారం సందర్శించారు. పునరావాస కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీఈవో రామచందర్‌రావు, వైద్యాధికారి డాక్టర్ కిషోర్, పంచాయతీ కార్యదర్శి శంకర్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ సిబ్బంది పాలొన్నారు.

పారిశుధ్య పనుల్లో వేగం పెంచాలి

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 5: పారిశుధ్య పనుల్లో వేగం పెంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పీ శ్రీజా అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ ముంపు ప్రాంతాలైన రాజీవ్ గృహకల్ప, పోలెపల్లిలో పర్యటించి పారిశుధ్య పనులకు పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య పనుల్లో మరింత వేగం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ కుమార్, ఎంపీవో రాజారావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రాకాశితండాను సందర్శించిన శ్రీజ

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 5: మండలంలోని రాకాశితండాను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీజ సందర్శించారు. తండాలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. జేసీబీ సహాయంతో చెట్లు, చెత్తచెదారం తొలగించి బ్లీచింగ్, క్లోరినేషన్, దోమల నివారణ మందును సిబ్బంది పిచికారీ చేశారు.

యువకుడి ఆత్మహత్య

పెనుబల్లి, సెప్టెంబర్ 5: ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాత్రి కల్లూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరుకు చెందిన బోడ భవానీప్రకాశ్ (23) కల్లూరులోని లైఫ్‌లైన్ ఇంటర్నెట్ షాపులో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం షాపుకు వెళ్లిన భవానీప్రకాశ్ షాపులో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. షాపులో పనిచేస్తున్న సహచర ఉద్యోగి లాల్‌మొహమ్మద్ షాపుకు వెళ్లి చూడగా ఉరివేసుకొని ఉండడాన్ని గమనించి మృతుడి తండ్రి రాముకు తెలిపాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 5: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని సుబ్లేడు పెట్రోల్ బంక్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రఘునాథపాలేనికి చెందిన వెన్నమళ్ల సాయిచందర్, నీరుడు గోవర్ధన్ మరిపెడబంగ్లా నుంచి బుధవారం రాత్రి స్వగ్రామైన రఘునాథపాలేనికి బైక్‌పై వెళ్తున్నారు. సుబ్లేడు పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ప్రాణాపాయస్థితిలో ఉన్న సాయిచందర్ (27)ను హైదరాబాద్ తరలిస్తుండగా సూర్యాపేట వద్ద మృతిచెందాడు. గోవర్ధన్ ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి అన్న శ్రావణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డయల్ 100కు ఆగస్టులో 4,119 కాల్స్: సీపీ

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 5: జిల్లా ప్రజలెవరికైనా ఆపద సమయం ఎదురైనప్పుడు 100కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందొచ్చని సీపీ సునీల్‌దత్ సూచించారు. సమాజంలో నేర ప్రవృత్తి పెరిగిన నేపథ్యంలో ప్రజల రక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన డయల్-100ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. డయల్ 100కు ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా 4,119 కాల్స్ వచ్చాయని, వాటిని విచారణ చేసి 91 కేసులు నమోదు చేశామని తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331758
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పోషకాహారంతోనే చిన్నారులకు ఆరోగ్యం

సత్తుపల్లి, సెప్టెంబర్ 5: మంచి పోషక విలువలు కలిగిన ఆహారంతోనే చిన్నారులకు మంచి ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ కల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ సంధ్యారాణి అన్నారు. గురువారం కల్లూరు 11 అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె గృహ సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సంధ్యారాణి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం, గ్రుడ్డు, పాలు పోషకాహారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్రీలక్ష్మీ, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ఆపద్బాంధవులు

- ఖమ్మం నగర వరద బాధితులకు అక్కున చేర్చుకుంటున్న జిల్లా వాసులు
- విరివిగా విరాళాలు.. తోచిన సహాయాలు.. ఆకలి తీర్చుతూ అన్నదానాలు
- స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, సముదాయాలు, వ్యక్తుల ఉదార దాతృత్వాలు

ఖమ్మం: కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిత్యావసరాలను పంపిణీ, రఘునాథపాలెం: ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ ఆధ్వర్యంలో, పాండురంగపురంలో..

ఖమ్మం/ ఖమ్మం ఎడ్యుకేషన్/ ఖమ్మం వ్యవసాయం/ రఘునాథపాలెం/ఖమ్మం రూరల్/చింతకాని /వైరాటౌన్, సెప్టెంబర్ 5: మున్నేరు వరదలో నిరాశ్రయులైన ఖమ్మం వరద బాధితులకు జిల్లా ప్రజలు అండగా నిలుస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, సముదాయాల బాధ్యులతోపాటు వ్యక్తులు కూడా ఉదారంగా దాతృత్వాలు చేస్తూ ఆపద్బాంధవులుగా నిలుస్తున్నారు. కొన్ని చోట్ల ఐదు రోజులుగా అన్నపానీయాలు లేకుండా ఆకలితో అలమటిస్తున్న వరద బాధితులకు అన్నదానాలు చేస్తూ వారికి ఆకలిని తీరుస్తున్నారు. మరికొందరు తమకు తోచిన సహాయాలు చేస్తుండగా.. ఇంకొందరు విరాళాలూ అందిస్తున్నారు. ఖమ్మం మున్నేరు వరద బాధితుల సహాయ సహకారాల్లో మానవత్వం మరోసారి పరిమళిస్తోంది. గురువారం కూడా అనేకమంది వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కమ్మ సంఘం నేతృత్వంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేశారు. శ్రీలక్ష్మీ బాలాజీ సేవా సమితి ఆధ్వర్యంలో ఐదో రోజైన గురువారం అన్నదానం చేశారు. ఖమ్మం ఫ్రూట్ మర్చంట్ వెల్ఫేర్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చేతుల మీదుగా గురువారం పండ్లు పంపిణీ చేశారు. జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తరపున కలెక్టర్‌కు బ్లాంకెట్లు అందజేశారు. జయవిలాసిని రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో రూ.2లక్షలు విరాళం చెక్కును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, కలెక్టర్ ఖాన్‌కు అందజేశారు. ఎక్సైజ్ ఉద్యోగులు రూ.25 వేల చెక్కును విరాళంగా ఇచ్చారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ట్రాలీ కార్మికులకు జీవీ మాల్ బాధ్యులు దుస్తులు పంపిణీ చేశారు. ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ బాధ్యులు, పాండురంగాపురం గ్రామస్తులు, ఎస్‌బీఐటీ, ఆర్జేసీ విద్యాసంస్థల బాధ్యులు పలు చోట్ల అన్నదానాలు చేశారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల కుటుంబాలకు 10 లక్షల సాయం

ఖమ్మం: ఫొటోగ్రాఫర్లకు నగదు అందజేస్తున్న దేవర నాగరాజు

ఖమ్మం, సెప్టెంబర్ 5: మున్నేరు వరద కారణంగా ఖమ్మంలో నిరాశ్రయులైన 26 మంది ఫొటో, వీడియోగ్రాఫర్ల కుటుంబాలకు ఖమ్మం జిల్లా ఫొటోగ్రఫీ యూనియన్ నాయకులు అండగా నిలిచారు. 26 మంది ఫొటోగ్రాఫర్లలో ఒక్కొక్కరికీ రూ.35 వేల నగదు, రూ.3 వేల విలువైన నిత్యావసర సరుకులు కలిపి మొత్తం రూ.10 లక్షలను ఖమ్మం జూబ్లీక్లబ్‌లో గురువారం బాధిత ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు అందచేశారు.

ఖమ్మం ఎడ్యుకేషన్: అన్నదానం చేస్తున్న ఆర్‌జేసీ కృష్ణ, ఖమ్మం: రూ.2 లక్షల చెక్కును పొంగులేటికి అందచేస్తున్న రాంబాబు, జిల్లా పెట్రోలియం డీలర్స్ ఆధ్వర్యంలో..

చింతకాని: లచ్చగూడెంలో విరాళాలు సేకరిస్తున్న యువత, వైరా టౌన్: ఐద్వా ఆధ్వర్యంలో.. ఖమ్మం రూరల్: బట్టలు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

'ఐసెట్' సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 5: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరేందుకు అవసరమైన ఐసెట్ కౌన్సెలింగ్ గురువారం ప్రారంభమైంది. నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను నిర్వహించారు. 280 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోగా 254 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైనట్లు క్యాంపు ఆఫీసర్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన మండల వ్యవసాయాధికారి

నమస్తే కథనానికి స్పందన

కొణిజర్ల, సెప్టెంబర్ 5: 'పత్తి రైతు చిత్తు' అనే శీర్షికను 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి మండల వ్యవసాయాధికారి బాలాజీ స్పందించారు. గురువారం మండలంలోని గద్దలగూడెం, తీగలబంజర గ్రామాల్లో పత్తిపంట, తుమ్మలపల్లి, పెద్దగోపతి, చిన్నగోపతి గ్రామాల్లో పెసర పంట దెబ్బతిన్నట్లు ఆయన తెలిపారు. పగిడేరు, పెద్దఏరు పరివాహక ప్రాంతాల్లో ఇసుక మేటలతో వరిపొలం కొంతమేర నష్టపోయిందని అన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు పేర్కొన్నారు.

చెక్కుల పంపిణీ

వైరాటౌన్, సెప్టెంబర్ 5: కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.17లక్షలు విలువైన చెక్కులను వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ 55 మంది లబ్ధిదారులకు అందజేశారు.

రైతులను ఆదుకుంటాం.. మంత్రి తుమ్మల

ఎర్రుపాలెం: రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

మధిర రూరల్, సెప్టెంబర్ 5 : వరదలతో పంట పొలాలు నీట మునిగిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, పరిహారం అందించి అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. చిలుకూరు గ్రామంలో నీట మునిగిన రైతులు నిడమానూరి నర్సింహారావు, రావిరాల సత్యనారాయణ, బండారు మల్లికార్జునరావు పొలాలను మంత్రి గురువారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. భారీ వర్షాలతో పత్తి, వరి పంటలు పూర్తి మునిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని మంత్రి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ విజయ్‌చందర్, ఏఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా రైతుబంధు కన్వీనర్ నలమల వెంకటేశ్వరరావు, నాయకులు మొండితోక సుధాకర్, మల్లాది వాసు, సూరంశెట్టి కిశోర్, కర్నాటి రామారావు, దారా బాలరాజు, నెల్లూరి రవి, నిడమానూరి వంశీ తదితరులు పాల్గొన్నారు.

పంటనష్టాన్ని అంచనా వేయాలి

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 5: భారీవర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని త్వరితగతిన అంచనా వేసి నివేదికలను వెంటనే అందజేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని మొలుగుమాడు, మీనవోలు గ్రామాల్లో గురువారం పర్యటించి భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించారు. తుమ్మల మాట్లాడుతూ అనుకోకుండా కురిసిన భారీవర్షాలకు రైతులకు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కేంద్ర బృందాలు కూడా రాష్ట్రంలో ముంపు నష్టాన్ని అంచనా వేసేందుకు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బండారు నర్సింహారావు, శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, లక్ష్మణరావు, రాజీవ్‌గాంధీ, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు మదార్‌సాహెబ్ ట్రస్ట్ చేయూత

దుప్పట్లు, దుస్తులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 5: ఆకేరు ప్రవాహానికి సర్వం కోల్పోయిన రాకాశితండ బాధితులకు సయ్యద్ మదార్ సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్, హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు, దుస్తులను జాయింట్ కలెక్టర్ శ్రీజ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శిలార్, మదార్‌సాహెబ్ ట్రస్ట్ బాధ్యులు సయ్యద్ సైదా, ఇమామ్, జడల రమేశ్. నగేశ్, కాంగ్రెస్ నాయకుడు చావా శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. భారతీయ స్టేట్ బ్యాంక్ ఖమ్మం రీజినల్ ఆధ్వర్యంలో దుప్పట్లు, దుస్తులు అందజేశారు.

మృతదేహంతో రహదారిపై రాస్తారోకో

రహదారిపై ధర్నా చేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు

చింతకాని, సెప్టెంబర్ 5: వరదల కారణంగా తమ మహిళ మృతిచెందినందున ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని రామకృష్ణాపురం స్టేజీ సమీపంలో వాగు వద్ద ఖమ్మం - బోనకల్లు ప్రధాన రహదారిపై అదే గ్రామానికి చెందిన దళితులు మృతదేహంతో గురువారం రాస్తారోకో చేశారు. గ్రామస్తుల కథనం ప్రకారం. రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గుర్రం నాగేశ్వరరావు - వసంత దంపతులు రోజువారీ కూలి పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై మంగళవారం ఖమ్మం వెళ్లి తిరిగి వస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఖమ్మం ధంసలాపురం వాగు వద్ద ప్రధాన రహదారిపై బురద పేరుకుపోయి ఉన్నది. వారి వాహనం ఆ బురదలో అదుపు తప్పింది. బైక్ వెనుక కూర్చున్న వసంత కిందపడడంతో ఆమె తలకు తీవ్రగాయాలై రక్తస్రావమైంది. హుటాహుటిన ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. వరదల కారణంగానే తమ మహిళ మృతిచెందినందున రూ.5 లక్షల పరిహారం ఇప్పించి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ రామకృష్ణాపురం గ్రామస్తులు ఆమె మృతదేహంతో రోడ్డుపై రాస్తారోకో చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో వారు రాస్తారోకో విరమించారు.

ట్రాక్టర్ వెలుగులతో దహన సంస్కారాలు

చింతకాని మండలంలో దయనీయ ఘటన

ట్రాక్టర్ లైట్లతో దహన సంస్కారాలు నిర్వహిస్తున్న దృశ్యం

చింతకాని, సెప్టెంబర్ 5: వైకుంతధామంలో విద్యుత్ దీపాల వెలుగులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను తెప్పించుకొని దాని వెలుగుల మధ్య దహన సంస్కారాలు జరిపిన దయనీయ ఘటన చింతకాని మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన గుర్రం వసంత (37) చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందింది. దీంతో గురువారం రాత్రి సమయంలో దహన సంస్కారాలు జరపడానికి ఆమె కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేశారు. వీధిలైట్లు వెలగకపోయినా వారు వైకుంతధామం వరకు చేరుకున్నారు. తీరా వైకుంతధామంలోనూ చిమ్మచీకట్లే ఉన్నాయి. విద్యుత్ దీపాల వెలుగులు లేకపోవడంతో చేసేదీలేక గ్రామం నుంచి ఓ ట్రాక్టర్‌ను పిలిపించుకున్నారు. దాని వెలుగుల్లో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కాగా, గత కేసీఆర్ ప్రభుత్వంలో వైకుంతధామాల్లోనూ 24 గంటలకూ విద్యుత్ వెలుగులు ఉండేవి. ఏ సమయంలో దహన సంస్కారాలకు వచ్చినా అంతిమ కార్యక్రమాలు పూర్తి చేసుకునే అవకాశం ఉండేది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిననాటి నుంచి వైకుంతధామాల్లో విద్యుత్ వెలుగులపై పట్టింపులేకుండా పోయిందని బంధువులు, గ్రామస్తులు చర్చించుకోవడం గమనార్హం.

సింగరేణిలో బ్లాస్టింగ్‌కు కూలిన ఇల్లు

సత్తుపల్లిటౌన్, సెప్టెంబర్ 5: మండల పరిధిలోని సింగరేణి ప్రభావిత ప్రాంతమైన కిష్టారం గ్రామంలో ఎస్సీకాలనీకు చెందిన మునగాల రాములు ఇల్లు నేలకూలింది. నాలుగేళ్లుగా సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ వల్ల పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి తడవడంతో గురువారం సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ నిర్వహిస్తున్న మూడు గంటల సమయంలో పేలుడు తీవ్రతకు నేలకూలింది. ఈ ఘటనలో గృహ సామగ్రి పూర్తిగా ధ్వంసమైంది. ఇకనైనా సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు స్పందించి తమ ప్రాణాలతో చెలగాటమాడకుండా తమకు పునరావాసం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కార్యక్రమంలో తాళ్ల రమేష్, భిక్షపతి, పత్తిపాటి అశోక్, పత్తిపాటి రామకృష్ణ, పరగడపు శివ పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చిన బీఆర్ఎస్ నాయకులు

గుంతల్లో కంకర పోస్తున్న నాయకులు

చింతకాని, సెప్టెంబర్ 5: మండలంలోని నాగులవంచ గ్రామం నుంచి పలు గ్రామాలకు కలిపే లింక్ రహదారిపై వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు బండిరేవు వాగు వరద పోటెత్తడంతో అధికారులు రహదారిని మూసివేశారు. దీంతో ఆ మార్గం గుండా వెళ్లేందుకు ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకుడు వంకాయలపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ యువత గురువారం శ్రమదానం చేసి గుంతలపై పెద్దకంకర వేసి దానిపై మట్టిని పోసారు. గుంతలు పూడ్చిన వెంటనే అధికారులు రహదారిపై వాహన రాకపోకలకు అనుమతించారు.

నిత్యావసరవస్తువుల పంపిణీ

కారేపల్లి, సెప్టెంబర్ 5: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లలోకి నీళ్లు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకుడు ఎస్‌కే గౌసుద్దీన్ గురువారం కారేపల్లిలో 30మంది పేద కుటుంబాలకు నిత్యావసరవస్తువులను అందజేశారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

ఖమ్మం ఎడ్యుకేషన్: సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రెజోనెన్స్ శ్రీనగర్‌లో ఉపాధ్యాయులు, సర్వజ్ఞలో.., త్రివేణి స్కూల్‌లో.., వైరా టౌన్: క్రాంతి జూనియర్ కళాశాలలో..

భావిభారత పౌరులను తీర్చిదిద్దే సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని, ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని పలువురు వక్తలు అన్నారు. గురువారం గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేట్, పలు స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నైతికత విలువలు ఉండాలని అన్నారు. జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే విద్యద్వారానే సాధ్యమవుతుందని, అలాంటి విద్యను అందించే గురువులను సన్మానించుకునేందుకు ఒకరోజు ఉండటం అభినందనీయమన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో టీచర్స్‌డే వేడుకలు

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 5: ఖమ్మం నగరంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఖమ్మం త్రివేణి పాఠశాలలో డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సర్వజ్ఞలో డైరెక్టర్లు రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, కొలిపార నీలిమ, స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ శ్రీనగర్‌లో డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయు వృతిపట్ల రాధాకృష్ణన్‌కు ఉన్న గౌరవానికి నిదర్శనంగా ఆయన జయంతి రోజున ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు.

మధిర రూరల్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కాన్సెప్ట్ స్కూల్ యాజమాన్యం, సత్తుపల్లి, సత్తుపల్లి టౌన్, పెనుబల్లిలో..